క్లుప్తంగా...

17వ వార్డులో కంటి వెలుగు



17వ వార్డులో కంటి వెలుగు శిబిరం

మేడ్చల్: పట్టణంలోని 17వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ ప్రారంభించారు. కింది బస్తీలోని దుర్గమ్మ గుడి వద్ద క్యాంపును నిర్వహించగా వార్డు ప్రజలు పరీక్షలు చేసుకున్నారు. వార్డులో కంటి వెలుగు శిబిరం దిగ్విజయంగా సాగిందని కౌన్సిలర్ తెలిపారు.

ఆరోగ్య సమస్యలు రాకుండా..



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సురేందర్

మేడ్చల్: వేసవి కాలంలో పిల్లలకు, గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలు రాకుండా గౌడవెల్లి గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ ఓఆర్‌ఎస్ పౌడర్, జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన మందులను పంపిణీ చేశారు. వేసవిలో పిల్లలు ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నాగారం 15వ వార్డులో..

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో సాయిబాబా దేవాలయం వద్ద గురువారం ధరణి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి కాలనీవాసుల నుంచి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో వైద్యులు ఉచితంగా వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాధిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, వెంకటరమణ, శ్రీనివాస్, హాస్పిటల్ నిర్వాహకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ శంకర కల్యాణం



మేడ్చల్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భక్తుడు విష్ణుశౌర్య ఆధ్వర్యంలో గౌరీ శంకర కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం కల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శాస్త్రోక్తంగా ఆదిదేవుడి కల్యాణాన్ని నిర్వహించగా వివిధ పార్టీల రాజకీయ నేతలు, భక్తులు తిలకించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటెరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, సర్పంచ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ కౌన్సిలర్లు మహేష్, హరికృష్ణ, శివకుమార్, నాగరాజు, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

సెలెబ్రిటీ రిసార్ట్స్ యజమానికి రిమాండ్

శామీర్‌పేట్: బోరు మోటారు సెట్, విద్యుత్ వైరును దొంగిలించిన నిందితులను గురువారం శామీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన జయఈశ్వర్‌రెడ్డి తన ఫాంహౌజ్‌లో ఉండగా జనవరి 4, 5 తేదీల్లో సెలెబ్రిటీ రిసార్ట్స్ యజమాని విజయ్‌సేన్‌రెడ్డి(69), మేనేజన్ హరిజోసఫ్(49)తో పాటు మరి కొందరు ఆయుధాలను చూపిస్తూ ఈశ్వర్‌రెడ్డిని చంపుతామని బెదిరించారు. ఫాంహౌజ్‌లోని బోరు మోటారు సెట్‌తో పాటు విద్యుత్ వైర్లను దొంగిలించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న శామీర్‌పేట పోలీసులు విచారణ అనంతరం నిందితులు విజయ్‌సేన్‌రెడ్డి, మేనేజన్ హరిజోసఫ్‌లను గురువారం రిమాండ్ చేశారు. మరి కొంత మంది పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని సీఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

కొనుగోళ్లలో కొర్రీలు

ధాన్యం సేకరణ లక్ష్యం.. 30 వేల మెట్రిక్ టన్నులు!

- కొనుగోలు చేసిన ధాన్యం 4,438 మెట్రిక్ టన్నులే..
- గన్నీ బ్యాగుల కోసం రోడ్డెక్కితే.. 'తేమ' సాకు..
- రైతులకు డబ్బులు చెల్లింపుల్లో కూడా తాత్సర్యమే..
- చెల్లించాల్సింది రూ.9.14 కోట్లు.. చెల్లించింది రూ.1.46 కోట్లే..
- మిగతా రూ.7.47 కోట్ల కోసం రైతుల ఎదురు చూపులు



ఏదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ధాన్యం సేకరణ కేంద్రాల్లో కొనుగోళ్లకు దిక్కులేని పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా అధికార యంత్రాంగం 12 ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించినా.. మంగళవారం నాటికి 896 మంది రైతుల నుంచి 4438.280 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో దాదాపు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేపట్టాల్సి ఉన్నా, తడిసిన ధాన్యం, తేమ, గన్నీ బ్యాగుల కొరత పేరుతో కొనుగోళ్లకు సహకార సంఘాలు కొర్రీలు పెడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనకు దిగినా.. న్యాయమేదీ..?

మేడ్చల్ మండలంలోని పలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కోసం ధాన్యం రైతులు రోడ్డెక్కగా ఘట్‌కేసర్, శామీర్‌పేట మండలాల్లో ధాన్యం తడిసిందని, తేమ శాతం అధికంగా ఉందన్న పేరుతో కొనుగోళ్లు చేపట్టడం లేదని ఆందోళనకు దిగినా న్యాయం జరగని పరిస్థితి నెలకొందని రైతు సంఘాలు, విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తేమ సాకుతో కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని సహకార సంఘాలు కొనుగోలు చేయడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రకటించినా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి సేకరణ కేంద్రానికి తీసుకువస్తేనే కొంటామని చెబుతున్నారని రైతులు వివరిస్తున్నారు. తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉన్నట్లయితే ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం సేకరణకు వీలుండదని జిల్లా పౌరసరఫరాల శాఖ పేర్కొంటోంది.

కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు ఎప్పుడిస్తారు?

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో రైతుల నుంచి 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 12 సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసిన జిల్లా పౌర సరఫరాల శాఖ, ఇప్పటి వరకు 4,438.280 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఖరీదు చేసింది. కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ము చెల్లించడంలోనూ.. జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తం సొమ్ము రూ.9.14 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.1.46 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా సొమ్ము రూ.7.47 కోట్ల కోసం సంబంధిత రైతులు ఎదురు చూస్తున్నారు.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్ జిల్లాలో ప్రతాపసింగారం, ఏదులాబాద్, మాదారం, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, మేడ్చల్, డబుల్‌పూర్, పూడూరు, శామీర్‌పేట్, అలియాబాద్, కీసరలోని సేకరణ కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు.

ధాన్యం కొనకపోతే రైతులకు తీవ్ర నష్టం

ఘట్‌కేసర్: రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఏదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ, మండల వ్యవసాయాధికారి బాసిత్‌తో కలిసి గురువారం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారని, అన్ని పరీక్షలు చేసిన తర్వాతే ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాలివ్వడం రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపిన అన్నదాతల సమస్యలు అటు ప్రభుత్వం, ఇటు అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.

అవార్డు సాధనకు కృషి చేసిన వారికి సత్కారం

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామానికి ఉత్తమ బయో డైవర్సిటీ అవార్డు వచ్చేందుకు కృషి చేసిన పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామ సర్పంచ్ గీతభాగ్యారెడ్డి సన్మానించారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పాలకవర్గం, పంచాయతీ సిబ్బంది సేవలను, అందించిన తోడ్పాటును కొనియాడి వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సర్పంచ్‌ను సన్మానించిన గ్రామస్తులు

అవార్డు సాధించిన సర్పంచ్ గీత భాగ్యారెడ్డిని గ్రామస్తులు, గ్రామ ప్రముఖులు, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. అవార్డు ఇచ్చిన ఉత్సాహంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు.

మంత్రి మల్లారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడుగౌస్, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, నాయకులు భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

ఎప్పుడు ఎన్నికలొచ్చినా కాంగ్రెస్ విజయం తథ్యం

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని ఎంఎఫ్ ఫంక్షన్, ఎన్టీఆర్‌నగర్, చంద్రగిరినగర్‌లలో గురువారం ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ.. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అధికారంలోకి వస్తే చేయబోయే పనులను ప్రజలకు వివరిస్తూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో మరోమారు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయనుందన్నారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్ పద్మశాలి, రషీద్, బోయిని వెంకటేష్, మాజీ వార్డ్ మెంబర్ గణేష్, జేమ్స్ తదితరులు ఉన్నారు.

ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన అర్జున్‌శర్మ, అల్లుడు ప్రదీప్‌శర్మ(23), సంతోశ్‌శర్మ, చందన్‌తో కలిసి ఆరేళ్ల క్రితం ఉపాధి కోసం బీబీనగర్‌కు వలస వచ్చి ప్లైవుడ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. బుధవారం ప్రదీప్‌శర్మ, పవన్ సింగ్, సనర్జిత్‌సింగ్‌తో మేడిపల్లిలోని స్నేహితుడి ఇంటికి వచ్చారు. గురువారం వేకువజామున ఆటోలో మేడిపల్లి నుంచి బీబీనగర్‌కు వస్తుండగా ఘట్‌కేసర్ ఎన్‌ఎఫ్‌సీనగర్ రైల్వే వంతెన సమీపంలో వేగంగా ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పడంతో ప్రదీప్‌శర్మ రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ..

జవహర్‌నగర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ విశ్వనాథం అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వే నంబర్–722 ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ సిబ్బంది జేసీబీతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు సహించబోమన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వీఆర్‌ఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కాచవానిసింగారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు

ఘట్‌కేసర్: కాచవానిసింగారం పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ విజయలక్ష్మి రెవెన్యూ సిబ్బందితో గురువారం కూల్చివేయించారు. గ్రామంలోని సర్వే నంబర్–66లోని ప్రభుత్వ భూమిలో నిర్మించినందున ఇళ్లను కూల్చివేయించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఇళ్లను నిర్మించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

జవహర్‌నగర్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానంటూ నమ్మబలికిన ప్రేమికుడు నిరాకరించడంతో మనస్థాపం చెందిన యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాప్రాల్‌లో చోటుచేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం యాప్రాల్ భూపేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న పూజ(18) దయాకర్ అనే వ్యక్తిని ప్రేమించింది. దయాకర్ మాటలు నమ్మిన పూజ ఈ నెల 24న దయాకర్ కిరాయి ఉంటున్న ఇంటికి వెళ్లింది. అక్కడే తనను పెళ్లి చేసుకోవాలంటూ నిలదీయడంతో అతడు మాట మార్చాడు. దీంతో మనస్థాపం చెందిన పూజ అక్కడే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని పూజ మృతికి కారణమైన దయాకర్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

వర్గల్(గజ్వేల్): చికిత్స కోసం అల్లుడితో బైక్‌పై వెళ్తున్న మహిళ కిందపడి మృతి చెందింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం లాల్‌గాడి మలక్‌పేటకు చెందిన వీరన్నగారి లక్ష్మి(61) ఆరోగ్యం బాగాలేకపోవడంతో గజ్వేల్ ఆస్పత్రిలో చూపించుకునేందుకు తన అల్లుడు ఎర్రబాబు నాగరాజుతో బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో వర్గల్ మండలం గౌరారం వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనుకాల కూర్చున్న ఆమె ఎగిరి రోడ్డుపై పడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శామీర్‌పేట చెరువులో పడి యువకుడు మృతి



అమీర్‌ఖాన్(ఫైల్)

శామీర్‌పేట్: శామీర్‌పేట పెద్దచెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని చిలకలగూడకు చెందిన అమీర్‌ఖాన్(22), తన కుటుంబసభ్యులతో కలిసి శామీర్‌పేట పెద్ద చెరువు వద్దకు వచ్చి కాలక్షేపం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు అమీర్‌ఖాన్ చెరువులో పడి నీటిలో మునిగిపోయాడు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామని, ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఘట్‌కేసర్ రైల్వే వంతెన పనుల్లో జాప్యం ఎందుకు?



మాట్లాడుతున్న ఆంజనేయులుయాదవ్, సంజీవరెడ్డి

- 15 ఏళ్ల నుంచి పనులు ఎక్కడే వేసిన గొంగళి అక్కడే..
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో 27న నిరసన దీక్ష

ఘట్‌కేసర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకులకు పట్టింపు లేదని, పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుయాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైల్వే వంతెన పనుల జాప్యంపై 27న చేపట్టనున్న నిరసన దీక్షపై గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాంగ్రెస్ హయాంలో 15 ఏళ్ల క్రితం వంతెన పనులకు శంకుస్థాపన చేశామని, 15 ఏళ్ల నుంచి వంతెన పనులు ఎక్కడే వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని దుయ్యబట్టారు. వంతెన పనుల జాప్యంపై అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన దీక్ష చేపడతామని అన్నారు. నిరసన దీక్షకు వివిధ హోదాల్లో పార్టీ అధ్యక్షులు, మహిళ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఫరూక్, సురేశ్, హరివర్ధన్, తరుణ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న రాహుల్‌యాదవ్, శివాజీనాయక్ తదితరులు

ఘట్‌కేసర్: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలోని యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఐఐటీఎం డిగ్రీ కళాశాలలో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్స్‌ను మండల అధ్యక్షుడు శివాజీ నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన మొదటి ముగ్గురికి ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్లెట్‌తో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఫోన్: 76618 99899 కు మిస్డ్ కాల్ చేయడంతో వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్ లింక్ ద్వారా వివరాలను వచ్చేనెల 17లోపు పొందుపరచాలని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతుల కింద ఎలక్ట్రిక్ స్కూటర్లను బహుకరిస్తారని తెలిపారు. రాకేశ్, శ్రీధర్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు ఫోన్: 8142903456, 8142803456

కండ్లకోయలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రారంభం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో గురువారం ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. మేరీ లైఫ్– మేరా స్వచ్ఛ్ షెహర్ లో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాన్ని ప్రారంభించగా గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఇంట్లోని పాత వస్తువులు, పుస్తకాలను అందజేశారు. ఎక్కువ మొత్తంలో పాత వస్తువులు తెచ్చిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రాములు, కౌన్సిలర్లు హంసరాణి, హేమంత్‌రెడ్డి, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



దమ్మాయిగూడలో వస్తువులు అందజేస్తూ..

కీసర: మేరా లైఫ్–మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ స్వామి అన్నారు. మేరా లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం వద్ద గురువారం వివిధ కాలనీలకు చెందిన ప్రజలు వినియోగంలోని వ్యర్థాలను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రంలో అందజేశారు. కమిషనర్ స్వామి మాట్లాడుతూ 15రోజుల పాటు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, ప్రజలంతా ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మేనేజర్ ఏ.వెంకటేషం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కండ్లకోయలో పాతవస్తువులు తీసుకుంటూ..